

## సాదా బైనా రైతులకు
## భూమి పట్టాలు ఇవ్వాలి


Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 116
సంచిక : 236
పేజీలు : 3
శనివారం, మే 09, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN




## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**టీ మీడియా,మే8,మధిర:**ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.శుక్రవారం మధిర నియోజకవర్గం లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మధిర పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎల్.డి.ఆర్.ఎం. రూమ్, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, రేడియాలజీ బ్లాక్, ఓపి రూమ్ లను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజువారీ కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారీ నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసరపు సి–సెక్షన్ ఆపరేషన్ చేయవద్దని అన్నారు. ఎమర్జెన్సీ వార్డ్ లో కేసు షీట్ లను పరిశీలిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు రెగ్యులర్ గా అందుతున్న భోజనం నాణ్యత అంశాలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.అంతకు ముందు మధిర మండలం కేంద్రంలో నూతనంగా మూడు కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నాలుగు కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అదనపు భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆనతరం మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, ఐటిఐ భవనం, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యత తో పూర్తి చేయాలని, సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.




## శాస్త్రీయ పద్ధతితో చేపలు అధిక దిగుబడి

### -జిల్లా మత్స్య శాఖ అధికారి

**టీ మీడియా ,మే 8, కూసుమంచి:**శాస్త్రీయ పద్ధతిలో యాజమాన్య విధానాలు పాటించి జలాశయాల్లో మత్స్యకారులు చేపలు అధిక దిగుబడి సాధించ వచ్చని సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులు నాయకు అన్నారు. మత్స్య పరిశోధన పాలేరు నందు రాష్ట్ర మత్స్య శాఖ, న్యూఢిల్లీ ఆర్థిక సహకారంతోషెడ్యూల్డ్ ట్రైబ్స్,ట్రైషెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్య కారులకు జలాశయాలను చేపల పెంపకం యాజమాన్యం పద్ధతులపై 3 రోజులపాటు జరుగు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతు లో ఆయన మాట్లాడుతూ మానవ జీవనావళికి చేప మాంసం అధిక శ్రేష్టమైనదని అందుకు నేడు ప్రపంచంలో చేపలకు అధిక డిమాండ్ ఉందని పేర్కొన్నారు. మత్స్యకారులు ఆర్థిక అభివృద్ధి పొందేందుకు మార్కెట్ డిమాండ్ మేరకు ఆధునిక మేలుకువలు పాటించి చేపలు అధిక

మిగతా 2లో



# నకిలీ లేఅవుట్లు

## కోట్ల మోసం..



### రియల్ ఎస్టేట్ ముఠా అరెస్ట్

**టీ మీడియా, మే 8, ఖమ్మం:**ఖమ్మం జిల్లాలో భారీ రియల్ ఎస్టేట్ మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ లేఅవుట్లు, తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలు చూపిస్తూ అమాయక ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన రియల్ ఎస్టేట్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి కీలక ఆధారాలు సేకరించారు.పోలీసుల వివరాల ప్రకారం, నగర పరిసర ప్రాంతాల్లో త్వరలో అభివృద్ధి జరుగుతుందని ప్రచారం చేస్తూ కొంతమంది వ్యక్తులు నకిలీ లేఅవుట్లు రూపొందించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నట్లుగా నమ్మబలికి తక్కువ ధరకే ప్లాట్లు ఇస్తామని చెప్పి పలువురి నుంచి అడ్వాన్స్‌లు, పూర్తి చెల్లింపులు వసూలు చేసినట్లు తెలిసింది.కొంతకాలం తర్వాత బాధితులు స్థలాలను పరిశీలించగా, చూపించిన సర్వే నంబర్లు మరియు అసలు భూముల వివరాలు సరిపోకపోవడంతో మోసం బయటపడింది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, నకిలీ డాక్యుమెంట్లను పరిశీలించి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.ఈ మోసంలో మరికొంత మంది పాల్గొన్న అవకాశముందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే పలువురు బాధితులను విచారిస్తున్నామని, ఇంకా ఎవరైనా మోసపోయి ఉంటే ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రభుత్వ అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, లేఅవుట్ వివరాలు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని పోలీసులు హెచ్చరించారు.మోసపోయిన బాధితుల సంఖ్య ఇంకా పెరిగేఅవకాశముందని అధికారులు చెబుతున్నారు.

**ప్రాథమిక విచారణలో వివరాల ప్రకారం:**

ముఠా సభ్యులు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, ఫ్లెక్సీల ద్వారా ఆకర్షణీయ ప్రకటనలు చేసేవారు.డి టి సి పి అప్రూవల్", "వెంచర్ రెడీ", "త్వరలో రిజిస్ట్రేషన్" అంటూ నకిలీ బ్రోచర్లు చూపించి ప్రజలను నమ్మించేవారు.నగర పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూములను లేఅవుట్లుగా చూపించి ప్లాట్లు విక్రయించినట్లు గుర్తించారు.అడ్వాన్స్

మిగతా 2లో

## నూతన బ్రిడ్జి వద్ద కుంగిన అప్రోచ్ రోడ్



**- పాత బ్రిడ్జిపై మీదుగా వాహనాల మళ్లింపు**

**- నిర్మాణ లోపమా, సాంకేతిక వైఫల్యమా?**

**టీ మీడియా, మే 8, బూర్గంపహాడ్ :** భద్రాచలం–సారపాక మధ్య గోదావరి నదిపై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నూతన (కొత్త) వారధి వద్ద భారీ ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. సారపాక వద్ద కొత్త వంతెనకు అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు గురువారం రాత్రి ఒక్కసారిగా కుంగిపోవడంతో అధికారులు అప్రమత్తమై కొత్త వారధిపై వాహన రాకపోకలను నిలిపివేశారు. మట్టి పక్కకు జారిపోవడాన్ని గమనించిన ప్రయాణీకులు భయాందోళనకు గురై రోడ్డు కుంగిన సమాచారం అధికారులకు తెలపడంతో హుటాహుటిన అక్కడకు చేరుకుని ప్రమాద తీవ్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్తతో వాహనాల రాకపోకలను కొత్త వారధిపై నిలిపివేసి పాత వంతెన మీదుగా మళ్లించారు. అయితే పాత బ్రిడ్జి కావడంతో పాటు పెద్ద పెద్ద వాహనాలు సైతం పాత వారధి మీదుగా వెళుతుండడంతో ప్రయాణీకులు, వాహనదారులు



మరింత భయాందోళనకు గురవుతున్నారు.

**నిర్మాణ లోపమా ?**

కొత్త వారధి వద్ద అప్రోచ్ రోడ్డు కుంగిపోవడంతో సంబంధిత శాఖ అధికారులు నిర్మాణ లోపాలపై దృష్టి సారించారు.

మిగతా 2లో



## ప్రజా దర్బార్ కి విస్తృతఏర్పాట్లు

**టీ మీడియా, మే 8, తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం: ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలోభాగంగా శనివారం తిరుమలాయపాలెం హెడ్‌క్వార్టర్స్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి సంబంధించి పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కూసుమంచి క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మండల అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు.కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, కూర్చోవడానికి సౌకర్యాలు, వినతిపత్రాల స్వీకరణ కౌంటర్లు, భద్రతా ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మండల ఎస్సై కూచిపూడి జగదీష్, ఎంపీడీవో షేక్ సిలర్, ఎమ్మార్వో లూథర్ విల్సన్, ఎంపీవో ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, కొప్పుల అశోక్, తిరుమలాయపాలెం సర్పంచ్ ధరావత్ సుజాత నరసింహారావు, మందడి ఇజ్రాయిల్, కొక్కిరేణి ఉపసర్పంచ్ సిరిగదే ఉపేందర్, మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ళ అంబేద్కర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్, చీమ లక్ష్మయ్య, దొడ్డ గురవయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జక్కేపల్లి సొసైటీ చైర్మన్గా దారా జయశ్రీ బాధ్యతలు

**టీ మీడియా, మే 8, కూసుమంచి:**కూసుమంచి మండలంలోని జక్కేపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్గా దారా జయశ్రీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సొసైటీ చైర్మన్గా ఉన్న నలబోలు చంద్రారెడ్డి గ్రామపంచాయతీ సర్పంచిగా ఎన్నిక కావడంతో చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దాంతో వైస్ చైర్మన్ అయినా దారా జయశ్రీకి ఈ అవకాశం దక్కింది. ఈమె సొసైటీ ఎన్నికల్లోజ మహిళ రిజర్వేషన్ కింద డైరెక్టర్గా గెలుపొంది వైస్ చైర్మన్గా ఎన్నికయింది. చంద్రారెడ్డి రాజీనామాతో తాను సొసైటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన దారాజశ్రీ మాట్లాడుతూఈ తనకి ఈ అవకాశం కల్పించిన జక్కేపల్లి గ్రామ సర్పంచ్ నల్లబోలు చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం వ్యవసాయ సొసైటీ అభివృద్ధి కోసం తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆమె చెప్పారు.తన ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేసిన జెక్కేపల్లిసొసైటీ డైరెక్టర్లు రైతులు గ్రామ ప్రజలు ఉద్యోగులకు జక్కేపల్లి సొసైటీ చైర్మన్ దారా జయశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

## పంట అవశేషాలను కాల్చొద్దు

### రైతులకు అవగాహన కల్పించిన అధికారులు

**టీ మీడియా,మే08,సింగారం(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని సింగరేణి గ్రామంలో రైతులు వరి, మొక్కజొన్న పంటల కోతల అనంతరం పంట అవశేషాలను కాల్చకూడదని వైరా డివిజనల్ ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ సూచించారు.ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతం తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు.అలాగే పొలాల్లో ఉండే సూక్ష్మ జీవులు నశించి భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.పంట అవశేషాలను కాల్చకుండా సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భట్టు అశోక్ కుమార్, ఏఈఓలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# సాదా బైనా రైతులకు భూమి పట్టాలు ఇవ్వాలి

**సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం**

**టీ మీడియా, మే 8 ,కామేపల్లి:**సిపిఎం కామేపల్లి మండల కమిటీ శాఖ కార్యదర్శుల సంయుక్త సమావేశం కామేపల్లిలోని గుండా బిక్షామరెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం హాజరై మాట్లాడారు.గత ప్రభుత్వ హయాంలో సాదా బైనా కింద భూమి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనాదిగా సాగులో ఉన్న భూములకు రైతులకు ఇప్పటికీ హక్కులు లేకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం సాదా బైనా దరఖాస్తులను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆశ చూపిస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు.

మండలంలోని వివిధ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు సాగులో ఉన్నప్పటికీ రైతులకు హక్కులు లేవని గుర్తుచేశారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సకాలంలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శిస్తూ, వెంటనే హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ నెల 30, 31 తేదీలలో రైతు సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు మండలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పేదలకు పని దొరక్కుండా చేసి, చేసిన పనికి కూలి డబ్బులు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు




గురిచేస్తోందన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాడుతామని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశానికి రామచంద్రయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, పార్టీ మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు బాదావత్ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు ఇంజం నాగభూషణం, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతితో చేపలు అధిక దిగుబడి

ఉత్పత్తి చేసేందుకు మత్స్యకారులు కృషి చేయాలని నాగులు నాయకు ఆకాంక్షించారు పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు తమ కేంద్రం ద్వారా నాలుగు వేల మంది మత్స్యకారులు మచ్చ రైతులకు శిక్షణ ఇచ్చామని మత్స్యకారులు చేపలు అధిక ఉత్పత్తికి ఆధునిక యాజమాన్య పద్ధతులు శిక్షణని సద్వినియోగం చేసుకోవాలని కోరుచు మత్స్యకారులు తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారులు చేపల మరింతఉత్పత్తిని సాధిస్తారని డాక్టర్ శ్యాం ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. మత్స్య శాస్త్రవేత్త బి రవీందర్ మాట్లాడుతూ మత్స్య సాగు రంగములు దేశ రాష్ట్ర స్థితిగతులు నీటి వనరులు భవిష్యత్తు కార్యాచరణ గురించి సవివరంగా చెప్పారు . జలాశయాలు దడి కంచ చేపల సాగుకు స్థలం ఎంపిక దడి కంచ నిర్మాణం మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వలల సైజు గురించి క్షుణ్ణంగా చెప్పారు.మత్స్య శాస్త్రవేత్త శాంతన మాట్లాడుతూ జలాశయాలు చేప పిల్లలు విడుదల చేయు సమయములో చేప పిల్లల సమాన పరిమాణం రంగు సైజు చురుకుదనం ఒకే విధంగా ఉండేటట్లు , వ్యాధులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు పంజరాల్లో చేపలకు మేత యాజమాన్యం వినియోగించు జాగ్రత్తలు గురించి ఆయన క్షుణ్ణంగా వివరించారు.యంగ్ ప్రొఫెషనల్ కుమారి దివ్య మాట్లాడుతూ జలాశయాల్లో రోహు వచ్చే బంగారు తీగ ఫంగస్ చేపలు పులస వంటి చేపలు అధిక ఉత్పత్తి సాగుకు అనుకూలమని అన్నారు.యంగ్ ప్రొఫెషనల్ డాక్టర్ కె అరుణ్ మాట్లాడుతూ చేపల సాగుకు ఎలా చేయాలో కలుపు మొక్కల నివారణ గురించి సవివరంగా చెప్పారు. చేపలు పట్టుబడి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మార్కెటింగ్ సమయములో మేలుకోవల గురించి ఆయన సవివరంగా చెప్పారు ఈ శిక్షణలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ మరియు ఖమ్మం జిల్లాలకి చెందిన 25 మంది మత్స్య కారులు హాజరైనారు.

## నకిలీ లేఅవుట్లు

రూపంలో లక్షల రూపాయలు తీసుకుని, తర్వాత కార్యాలయాలను మూసివేసి పరారయ్యే ప్రయత్నం చేసినట్లు సమాచారంబ్యాంక్ ఖాతాల ద్వారా భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు ఇద్దరు బ్రోకర్లు, ఒక డాక్యుమెంట్ డిజైనర్, ఒక ఫైనాన్స్ కలెక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరికొంత మంది సహచరుల కోసం గాలింపు కొనసాగుతోంది.ప్రధాన నిందితుడు -- నకిలీ లేఅవుట్ల రూపకల్పన, ప్లాట్ల విక్రయాల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి.ఇద్దరు బ్రోకర్లు -- కస్టమర్లను ఆకర్షించడం, ప్లాట్ల చూపింపు, అడ్వాన్స్ వసూళ్ల బాధ్యతలు నిర్వహించినట్లు గుర్తింపు.డాక్యుమెంట్ డిజైనర్ -- నకిలీ డి టి సి పి అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, లేఅవుట్ మ్యాపులు తయారు చేసినట్లు అనుమానం.ఫైనాన్స్ కలెక్టర్ -- బాధితుల నుంచి నగదు, ఆన్‌లైన్ చెల్లింపులు సేకరించి ముఠా ఖాతాలకు మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు.

### నూతన బ్రిడ్జి వద్ద కుంగిన అప్రోచ్ రోడ్

అయితే బ్రిడ్జి కింద అప్రోచ్ కొట్టుకుపోవడానికి ఏమైనా సాంకేతిక కారణాలున్నాయా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రయాణీకులు, వాహనదారుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు వాహన రాకపోకలను ఈ వంతెనపై నిలిపివేసినప్పటికీ ఎన్నో కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కొద్దికాలానికే ఇలా అప్రోచ్ కొట్టుకుపోవడం పట్ల పలువురు నేషనల్ హైవే అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు.అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయిన సమయంలో అధికారులు అప్రమత్తమై మరమ్మతు పనులు చేపట్టారు. అయితే ఇప్పటికే ఎడమవైపు అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా కుడి వైపున అప్రోచ్ రోడ్డు కుంగిపోవడంపై పలువురు వాహనదారులు నూతన వారధి నిర్మాణ పనులపై మండిపడుతున్నారు. ఈ విషయమై నేషనల్ హైవే డీఈ శైలజను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు

- **జిల్లా కలెక్టర్ అంకిత్**
- **సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,**

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలన**

**టీ మీడియా,మే08, కొత్తగూడెం**

సుజాతనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగం, ఇన్ పేషెంట్ విభాగం, మందుల గది, సిబ్బంది హాజరు నమోదు పత్రాలు, ఔట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి రోజువారీగా నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల నిర్వహణ, ల్యాబ్ సేవల పరిస్థితి, పరీక్షల ఫలితాలను రోగులకు సమయానికి అందిస్తున్న విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల స్టాక్, అవసరమైన మందుల లభ్యత, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.



## వైరా రిజర్వాయర్‌లో పడి డ్రైవర్ మృతి.

**టీ మీడియా, మే 8, కొణిజర్ల :**వైరా రిజర్వాయర్ వద్ద వాకింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వైరా గ్రామం లీలా సుందరయ్య నగర్‌కు చెందిన ఆది శివరామ ప్రసాద్ (48) వృత్తిరీత్యా డ్రైవర్. గురువారం రాత్రి 8 గంటల సమయంలో భోజనం చేసిన తర్వాత వాకింగ్ కోసం రిజర్వాయర్ వద్దకు వెళ్లాడు. అక్కడ నడుస్తుండగా కాలు జారి నీటిలో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి తండ్రి ఆది వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొణిజర్ల ఎస్సై సూరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు

### -ఎస్బిఐ రీజినల్ కార్యాలయం వద్ద ఉద్యోగుల మౌన నిరసన

**టీ మీడియా ,మే 8, ఖమ్మం :** బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ నాయకులు కె. రాంబాబు హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఎస్బిఐ ఖమ్మం రీజినల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు మౌనం పాటించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కె. రాంబాబు మాట్లాడుతూ –ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ప్రభుత్వం ముందు 16 డిమాండ్లను ఉంచిందన్నారు. మూడు దశాబ్దాలుగా నిలిచిపోయిన మెసెంజర్ల నియమాకాలు చేపట్టడం ఆర్మ్డ్ గార్డుల నియమాకం, ఎన్పిఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మార్చుకునే అవకాశం కల్పించడం 2019 తర్వాత నియమితులైన ఉద్యోగులకు ఇంటర్ బదిలీలు సహా పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచడం –జరిగిందన్నారు. శాశ్వత ఉద్యోగాల అవుట్సోర్సింగ్ నిలిపివేయడం, తగిన సిబ్బందిని నియమింకపోవడం ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిందని రాంబాబు తెలిపారు. అర్హులైన రిటైర్ ఉద్యోగులకు నోషనల్ స్టాగినేషన్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మే నాలుగు నుంచి వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహిస్తున్నామని నాలుగున బ్యాడ్జి ధరించడం, మే ఐదున భోజన విరామ –సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని మే ఆరున ట్విట్టర్ క్యాంపియన్ చేశామని దీనికి ఉద్యోగుల నుండి అపూర్వ స్పందన –లభించిందని రాంబాబు తెలిపారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే మే 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు దేశ వ్యాప్త సమ్మెను చేపడతామని దీనిని విజయవంతం చేయాలని రాంబాబు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

## మూడోసారి పెళ్లి కానుక

### అందజేసిన సర్పంచ్ సలీమా ఖాసీం



**టీ.మీడియా,మే8, ముదిగొండ** :రాజకీయాల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో న్యూ లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ సలీమా ఖాసీం సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీని అక్షరాలా అమలు చేస్తూ, నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. తాజాగా శుక్రవారం గ్రామానికి చెందిన తెరగొర్ల వాణి వివాహ సందర్భాన్ని పురస్కరించుకుని, సర్పంచ్ వరుసగా మూడోసారి పెళ్లి కానుకను అందజేసి తన సేవా హ్యాట్రిక్‌ను పూర్తి చేశారు.గత మార్చిలో కొట్టే శ్రీవాణి, మే నెల ఆరంభంలో పెరుమాళ్ళ దీప్తి వివాహాలకు సాయం అందించిన ఆమె, నేడు తెరగొర్ల వాణి వివాహానికి 50 కేజీల బియ్యం , విలువైన చీరను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "పదవి అనేది ఒక బాధ్యత మాత్రమేనని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే తనకు అసలైన సంతృప్తినిస్తుందని" పేర్కొన్నారు.సొంత నిధులతో వరుసగా మూడు కుటుంబాలకు అండగా నిలిచిన సర్పంచ్ సలీమా ఖాసీంపై ముదిగొండ మండల వ్యాప్తంగా, న్యూ లక్ష్మీపురం గ్రామస్తులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన బాంబు డిస్పోజల్ బృందం

- సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**టీ మీడియా ,మే8, కొత్తగూడెం**

జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో బాంబు డిస్పోజల్ బృందం ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించినట్లు ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. భద్రతా బలగాలతో పాటు సంయుక్తంగా నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్లలో మావోయిస్టులకు సంబంధించిన 6 డంప్‌లను, 5 ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో సమర్థవంతంగా విధులను నిర్వర్తించిన జిల్లా బాంబు డిస్పోజల్ బృందం సభ్యులను ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటు చేసినటువంటి 10 ఐఇడిలను కనుగొని వాటిని అత్యంత చాకచక్యంగా బీడీ టీం సిబ్బంది నిర్వీర్యం చేసిందని అన్నారు. క్లిష్ట పరిస్థితులలో బీడీ టీం ప్రదర్శించిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు ఎంతో గర్వకారణమని కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అటవీ ప్రాంతాలలో తనిఖీలు చేసేటప్పుడు నిర్ణీత నిబంధనలను కచ్చితంగా పాటించాలని, స్వీయ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచనలు చేశారు. నూతన ఉత్సాహంతో పనిచేస్తూ ప్రతిభ కనబరిచిన 12 మంది బీడీ టీం పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు, రివార్డులను



అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆపరేషన్స్ రవి, టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కిషోరి బాలికల కోసం శిక్షణా కార్యక్రమశీ..

**టీ.మీడియా,మే8,చింతూరు:**యుక్తవయసులో బాలికలు ఎదుర్కొనే శారీరక మార్పులు, ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని పర్యవేక్షణ అధికారి డి. ప్రియాంక సూచించారు. శుక్రవారం చింతూరులోని పాఠశాలలో 'కిషోరి వికాసం' వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడవ సెషన్‌ను నిర్వహించారు.

**రక్తహీనతపై పోరు - ఆరోగ్యమే లక్ష్యం**

ఈ సెషన్‌లో బాలికలకు రక్తహీనత ఐరన్ లోపం మరియు హిమోగ్లోబిన్ స్థాయిల ప్రాముఖ్యతపై అధికారిణి ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

**శరీర పెరుగుదల:** యుక్తవయసులో శరీర పెరుగుదల వేగంగా ఉండటంతో పాటు, నెలసరి కారణంగా రక్తహీనత ఏర్పడే ప్రమాదం ఉంటుంది.

ఆహార నియమాలు: రక్తహీనతను నివారించేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలి.

**బాలికలు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

బాల్య దశ నుండి యవ్వన దశకు మారే సమయంలో బాలికలు సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల్య ఆహారాన్ని భాగం చేసుకోవాలని నిపుణులు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పాలకూర, తోటకూర వంటి ఆకుకూరలు, ప్రోటీన్ అధికంగా ఉండే గుడ్లు, పప్పులు, శనగలతో పాటు ఐరన్ వనరులైన బెల్లం, ఖర్జూరం, కిస్మిస్‌లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు పాలు, పండ్లు ఆరోగ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు షఫీ, పొడియం లక్ష్మి పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

## లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది ఎం.వి రమణ

**టీ.మీడియా,మే8, భద్రాచలం**



భద్రాచలం ప్రథమ శ్రేణి జ్యూడిషియల్ కోర్ట్ నందు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా సీనియర్ మహిళా న్యాయవాది ఎం.వి రమణని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మెన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎస్.సరిత నియమించారు. ఎం.వి.రమణ ఈ పదవిలో మూడు సంవత్సరాలపాటు కొనసాగుతారు. ఈ సందర్భంగా ఎంవి రమణ మాట్లాడుతూ నిరుపేద కక్షిదారులకు న్యాయ సహాయం అందిస్తానని అన్నారు. ప్రజలలో న్యాయ అవగాహన పెంపొందించుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా నియమించిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీస్ ఛైర్మన్‌కి, భద్రాచలం జ్యూడిషియల్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివ నాయక్‌కి, అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. అదేవిధంగా సహకరించిన సీనియర్ న్యాయవాదులకు ఎం. వి. రమణ కృతజ్ఞతలు తెలిపారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా నియమించబడ్డ రమణకి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసాచారి, సీనియర్ న్యాయవాదులు ఎం.వి రమణారావు, నండూరి శ్రీనివాస్, పలివెల నర్సింహా రావు, గొడపర్తి నాగరాజు, విద్యాసాగర్,గణపతి రావు, చైతన్య, శ్రీమన్నారాయణ, రావిరామ్ మోహన్, పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, కిషోర్, అవులూరి సత్యనారాయణ, సంకా నర్మద, లలిత, తరుణీ రజని, పేరాల వెంకటేశ్వర్లు తదితర న్యాయవాదులు ఎం.వి రమణకి అభినందనలు తెలిపారు.

## వేసవి నైపుణ్య శిక్షణ కార్యక్రమం



**టీ మీడియా ,మే8, కురవి:**కాంపల్లి ఉన్నత పాఠశాలలో 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు వేసవి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డోలి అరుణశ్రీ తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాలలో ఉంటున్న బడి ఈడి పిల్లలందరూ కూడా ఈ వేసవి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, స్పోకెన్ ఇంగ్లీష్,యోగ, స్పోర్ట్స్ తదితరాంశాలలో ప్రత్యేక నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులుకు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ప్రత్యేకంగా స్నాక్స్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోపరుచుకోవాలని మరియు తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలకు పంపాలని కోరారు.



## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి'

**టీ మీడియా, మే 8, రుద్రంపూర్ :** కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయానికి నూతనంగా బాధ్యతలను చేపట్టిన పర్సనల్ ఆఫీసర్ తిరుపతిని శుక్రవారం శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని, సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ మేడిపల్లి కరుణాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాషబోయిన రవికుమార్, తోకల రామచందర్ పాల్గొన్నారు.